క్లుప్తంగా

‘విశ్వావసు’ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వావసు తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను మోహినిపుర వెంకటేశ్వర ఆలయంలో దేవాదాయశాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి శనివారం ఆవిష్కరించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఉద్యోగులు, అర్చక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈఓ విశ్వనాథ్‌శర్మ, బుగ్గ రాజేశ్వరిస్వామి ఆలయ ఈఓ శ్రీధర్‌రెడ్డి, చైర్మన్ అమరేశ్ విష్ణు, ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, చంద్రకుమార్, రాంరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



పర్యావరణం గురించి వివరిస్తున్న విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుజాత, దేవదాసు అన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు శంషాబాద్ పరిధిలోని కర్తల్‌లో శనివారం జరిగిన ‘యూత్ లీడర్స్ కాన్క్లేవ్ ఫర్ బెటర్ ఎర్త్’ అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు పోస్టర్ ప్రెజంటేషన్ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై వివరించారు. ప్రొఫెసర్లు పురుషోత్తంరెడ్డి, బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. జంతు జాలాన్ని రక్షించుకోవాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే భారీనష్టం



అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది

దుబ్బాకటౌన్: అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే భారీగా ఆస్తి, ప్రాణనష్టం తప్పదని అగ్నిమాపకశాఖ అధికారి కమలాకర్ హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం సినిమా థియేటర్‌లో ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కంచారు. లీడింగ్ ఫైర్ అధికారి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్‌కు దారేది?



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయానికి వెళ్లేదారి లేకుండా అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం డిమాండ్ చేశారు. కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన మున్సిపల్ భవనం వద్ద అధికారులు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీని వల్ల కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ వాహనాలను ఎండలోనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, నవీన్, జగ్జీవన్, వికాస్, అరవింద్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు పరామర్శ



రామలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: మండలంలోని చింతమడక గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త వాతపు సత్యానారాయణ భార్య రామలక్ష్మి ఇటీవల క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. వారితో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వర్మ తదితరులు ఉన్నారు.

పార్కుపై పట్టింపేదీ?

పిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కులు, ఉద్యానవనాల నిర్వహణ కరువైంది. దుబ్బాకలో పార్కులను అభివృద్ధి చేసినప్పటికీ సంబంధిత అధికారులు వాటిపై కన్నెత్తి చూడకపోవడంతో అధ్వానంగా మారాయి. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు, ఇతర సామగ్రి పాడవుతోంది.

నిర్వహణ లేక కరువైన ఆహ్లాదం

- విరిగిన పరికరాలు, పాడైన సామగ్రి
- పట్టించుకోని అధికారులు



రామసముద్రం కట్టపై పిల్లల పార్కు

దుబ్బాకటౌన్: పట్టణ కేంద్రంలో ప్రజలు సేద తీరేందుకు రామసముద్రం చెరువుకట్ట మీద చిల్డ్రన్ పార్క్‌ను, 18వ వార్డులో ఉద్యానవనం, దుంపలపల్లి 4వ వార్డులో ఫ్రీడమ్ పార్కును ఏర్పాటు చేశారు.

నిర్వహణ శూన్యం

లక్షల రూపాయల నిధులతో పలుచోట్ల ఏర్పాటు చేసిన పార్కుల్లో ఆహ్లాదం లేకుండా పోయింది. పార్కు చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా మారాయి. నిర్వహణ లేకపోవడంతో కట్టపై ఓపెన్ జిమ్ వద్ద ప్లాట్‌ఫామ్ ధ్వంసమైంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

విరిగిన ఆట వస్తువులు

పట్టణ సుందరీకరణలో భాగంగా రామసముద్రం చెరువు కట్టపై 2019లో రూ.50 లక్షల ఎస్‌ఓఎఫ్ నిధులతో నిర్మించిన పిల్లల పార్కు విరిగిన ఆట వస్తువులతో దర్శనమిస్తోంది. గుర్రపు బొమ్మలు, జారుడు బల్లలు, ఉయ్యాలలు విరిగిపోయాయి.



మాయమైన ఉయ్యాలలు



జిమ్ వద్ద పాడైన ప్లాట్‌ఫామ్

కొన్నింటిని మందుబాబులు చెరువులో పడేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మందుబాబులకు అడ్డాగా

మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి నాలుగో వార్డులో 2022లో రూ.4 లక్షలు వెచ్చించి ఫ్రీడమ్ పార్కు నిర్మించారు. అందులో వివిధ రకాల మొక్కలు నాటి, జాతీయజెండా రంగులో టైర్లతో కుర్చీలు, ఉయ్యాలలు ఏర్పాటు చేశారు. కాని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మొక్కలకు నీరందడం లేదు. దీంతో అవి ఎండిపోవడంతో పశువులకు మేతగా మారాయి. పార్కు చుట్టూ ఉన్న ఫెన్సింగ్ విరిగిపోయి, సిమెంటు దిమ్మెలు ధ్వంసమయ్యాయి. పార్కులో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు దర్శనమిస్తున్నాయి.

సిబ్బందిని నియమిస్తాం..



పిల్లల పార్కులు, ఉద్యాన వనాలను మెరుగుపరిచేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం. నిధుల లభ్యతను బట్టి సౌకర్యాలు కల్పిస్తాం. వాటి నిర్వహణకు త్వరలోనే సిబ్బందిని నియమిస్తాం.

\- శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

మరమ్మతులు చేపట్టాలి



పట్టణంలో రామసముద్రం చెరువు కట్టపై పార్కులో ఆట వస్తువులు విరిగి పోవడంతో చిన్నారులు నిరాశ చెందుతున్నారు. విరిగిన ఆట వస్తువులకు మరమ్మతులు చేయించాలి. అలాగే ఉయ్యాలలను తిరిగి ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- శ్రీకాంత్, దుబ్బాక



చిన్నకోడూరులో సామూహిక సీమంతాలు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ శారద

చిన్నకోడూరు(సిద్దిపేట): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ శారద అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టడంతోపాటు ఆరు నెలల వరకు తల్లి పాలు తాగించాలన్నారు. గర్భిణులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలోనే ఒక పూట భోజనం తినాలని, పిల్లలకు బాలామృతం తినిపించాలని సూచించారు. పోషకాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి, సామూహిక సీమంతాలు చేశారు. ఎంపీడీఓ జనార్దన్, సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు..

హుస్నాబాద్‌రూరల్: గర్భిణులు పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అధికారి తిరుమల అన్నారు. పందిల్లలో నిర్వహించిన పోషక పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషకాలు కలిగిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకొంటే పిల్లల ఎదుగలలో లోపాలు ఉండవని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు శారద తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్: పోషకాహారాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పౌష్టికాహారంతోనే ఎదుగుదల

బెజ్జంకి(సిద్దిపేట): పౌష్టికాహారాన్ని అందించినపుడే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని హుస్నాబాద్ సీడీపీఓ జయమ్మ అన్నారు. మండలంలోని బేగంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. సూపర్‌వైజర్ నాగరాజు, తోటపెల్లి వైద్యాధికారి కృష్ణతేజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముంద్రాయి సెక్టార్‌లో..

నంగునూరు(సిద్దిపేట): గర్భిణులు వైద్యులు సూచించిన వాక్సిన్లు తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని సీడీపీఓ శారద సూచించారు. ముంద్రాయి సెక్టార్‌లో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలతో వండిన పదార్థాలను ప్రదర్శించి వాటి లాభాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సూపర్ వైజర్ స్వరూప, హెచ్ఓ స్వామి, అనురాధ, సౌమ్య, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలో మహిళలకు ప్రాధాన్యం

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గుగ్గిల్ల, దాచారం, కల్లెపెల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. అంతరం మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5.56 లక్షల చెక్కులను 18 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, చేప్యాల శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్, కుమార్, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కవ్వంపెల్లి

పల్లెల్లోకి కరువును తీసుకొచ్చిన కాంగ్రెస్

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తెలంగాణ పల్లెల్లోకి కరువును తీసుకొచ్చిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రాయపోల్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 27న జరిగే సభకు ప్రజలు చీమల దండులా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. కక్షసాధింపు పాలన

కొండపాక(గజ్వేల్): రాష్ట్రంలో ప్రజాపాలన కాదు.. కక్షసాధింపు పాలన కొనసాగుతుందంటూ ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కుకునూరుపల్లి, దుద్దెడలోని ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగసభ నిర్వహణ కోసం శనివారం ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన స్వర్ణయుగంలా ప్రజలు కొలుస్తున్నారన్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో నిర్వహించినది రాజ్యాంగ పరిరక్షణ పోరుయాత్ర కాదని ముఖ్య నేతల పదవులను కాపాడుకునేందుకు నిర్వహించిన పోరుబాట అన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలనిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి చెరువులకు నీరు విడుదల చేయకుండా లక్షల ఎకరాల్లో పంటలు ఎండగొట్టి రైతులను ఆగం చేసిందని వాపోయారు. ఎల్కతుర్తిలో నిర్వహించే భారీ బహిరంగసభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని కోరారు. అనంతరం బహిరంగసభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, అమరేందర్, దుర్గయ్య, కుమార్, శ్రీనివాస్, కనకయ్య, భగవాన్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌చారి, శ్రీనివాస్, ఐలయ్య, ఎల్లం, లక్ష్మణ్‌రాజ్, హైమద్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

యేసుక్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: యేసుక్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకమని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లో శనివారం నిర్వహించిన ‘రన్ ఫర్ జీసస్’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యేసు బోధనల ప్రాధాన్యాన్ని చాటిచెప్పడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కార్యక్రమ నిర్వాహకులు రూబెన్, బాపురెడ్డి, ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు సమీర్, మొనగారి రాజు, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ర్యాలీ

హుస్నాబాద్: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో క్రైస్తవులు, పాస్టర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ల కమిటీ అధ్యక్షుడు సాల్మన్ రాజ్, మలాకీ, రత్నకుమార్, ఇస్సాక్, తిమోతి, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: ‘రన్ ఫర్ జీసస్’ కార్యక్రమంలో పాల్గొన్న నర్సారెడ్డి

ఆరోగ్య పరిరక్షణకే పరేడ్

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసమే పరేడ్ నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ చెప్పారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు, అలవాట్లకు పడి విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే వారవుతారన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్‌ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ వద్దు.. పాత విధానమే ముద్దు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెడుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలంటూ స్థానిక డాక్యుమెంట్ రైటర్లు శనివారం కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏమీ ఉండదన్నారు. స్లాట్ బుకింగ్‌లో స్టాంప్ పేపర్ లేకుండా డాక్యుమెంట్ ఉంటుంది కాబట్టి స్టాంపు వెండర్లు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. పాత విధానం కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రిజిస్ట్రేషన్, స్టాంప్‌లశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను కోరారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతినే కొనసాగించాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్ విధానం వల్ల ఎన్నో యేళ్లుగా ఉపాధి పొందుతున్న తాము రోడ్డున పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హమీద్, ధనుష్, మసూద్, ప్రసాద్, మల్లేశం, నరేందర్, నవీన్‌కుమార్, రసూల్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, ఇమ్రాన్, రాజేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. బొడ్రాయి వార్షికోత్సవం



బోనాలతో తరలి వస్తున్న మహిళలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరులో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా దూసకంటి రాజేశ్‌శర్మ, నవీన్‌శర్మ, వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇండ్ల వద్ద నుంచి బిందెలతో నీళ్లు తీసుకువచ్చి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలతో తరలివెళ్లి బొడ్రాయి, పోచమ్మలకు నైవేద్యంగా సమర్పించారు. బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తిచేయండి

హుస్నాబాద్: అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట పలువురు లబ్ధిదారులు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం నిరుపేదలను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే 75 శాతం నిర్మాణాలు పూర్తి చేశారని, మిగితా పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. యేడాదిన్నర నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పూర్తిచేసి తమకు అప్పగించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి, లబ్ధిదారులు సునీత, ప్రమీల, సువర్ణ, సరిత, శారద తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ హౌసింగ్‌బోర్డు, లాల్‌కమాన్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దానిలో భాగంగా శివాజీనగర్, శ్రీనగర్‌కాలనీ, పారుపల్లివీధి, దోబిగల్లి, వాసవినగర్, బోయగల్లి, లాల్‌కమాన్, పాత చేపల మార్కెట్, శివప్పకాలనీ ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

◆ విశ్వకర్మలకు లబ్ధి

సిద్దిపేటకమాన్: విద్యుత్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న విశ్వకర్మలకు 25 హెచ్‌పీ కెపాసిటీ సరఫరాకు అనుమతి ఇవ్వడంతోపాటు యూనిట్ ధర రూ.4 కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షించతగ్గదని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాసంపల్లి నరసింహాచారి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలయ్యాచారి, యాదగిరిచారి, నాగరాజు, శ్రీనివాస్, నరసింహాచారి, పెంటాచారి తదితరులు పాల్గొన్నారు.

◆ బెదిరింపులకు పాల్పడుతున్న యాజమాన్యం

గజ్వేల్‌రూరల్: బకాయి వేతనాలు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్న ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఐఓసీలో కార్మికశాఖ కార్యాలయం ఎదుట వైద్యసిబ్బందితో కలిసి శనివారం నిరసన తెలిపి, ఆ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లోని అతిథి ఆస్పత్రి సిబ్బంది, కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో స్వామి, వైద్యులు యుగేందర్, సంతోష్, హరిశంకర్, రాజు, జమీర్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పీసీసీ అధికార ప్రతినిధి పూజలు

గజ్వేల్‌రూరల్: అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఉండాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. మండల పరిధిలోని అనంతరావుపల్లిలో దుర్గామాత, ఎల్లమ్మతల్లి, మహంకాళమ్మ, మత్తడి పోచమ్మతోపాటు నాభిశిల ఆలయ వార్షికోత్సవంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డితో కలిసి శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తీగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్, భాస్కర్, మల్లేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సిద్దిపేట అధ్యాపకుడికి డాక్టరేట్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణంరాజు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు శనివారం ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మధుసూదన్, అయోధ్య రెడ్డి, గోపాల సుదర్శనం, రవికుమార్, భాస్కర్, సుమలత, శ్రీనివాస్, ఆంజనేయులు, మనోహర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన అవసరం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో శనివారం వివిధ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు.

◆ మహిళా కూలీకి గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్ద శనివారం ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ పడి కూలీలు బుర్ర పద్మ, కొర్వి శ్యామలకు స్వల్ప గాయాలైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. భూ అభివృద్ధి పథకం(ఎల్‌డీపీ) పనులకు వచ్చిన ఆ కూలీలు చెట్లు, పొదలను తొలగిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, వారిని కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

◆ ఇసుక వేలం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి శివారులో 16న రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన సుమారు 100 ట్రాక్టర్ ఇసుకను శనివారం వేలం వేశారు. వేచరేణి గ్రామానికి చెందిన దేవనబోయిన సత్యం రూ.లక్షకు పాట పాడి దక్కించుకున్నట్లు తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

◆ నియామక పత్రం అందజేత

దుబ్బాక: యాదవ విద్యావంతుల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా లచ్చపేటకు చెందిన శ్రీనివాస్ యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ శనివారం నియామకపత్రం అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ యాదవులు అభివృద్ధి చెందాలన్నారు.